క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖానాపూర్: నెలవారీ మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ తెలిపారు. మండలంలోని సత్తనపల్లి, బీర్నంది, పాతఎల్లాపూర్‌తోపాటు కడెం మండలం లింగాపూర్, పెంబి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తిలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. గ్రామంలోని శనిగారపు భీమరాజుకు చెందిన గేదె మంగళవారం మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాలేదు. బుధవారం గేదె కోసం వెతకగా..శివారులోని గోదావరి నదిలో విద్యుత్ షాక్‌తో మృతి చెంది ఉంది. గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని.. ప్రభుత్వం తనకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

న్యూఇయర్ వేడుకలు


కడెంలో వేడుకల్లో పాల్గొన్న ఓ కుటుంబం

కడెం: మండలవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను మంగళవారం అర్ధరాత్రి, బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి.. టపాసులు కాలుస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.
తానూరు: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోరిగాం మహాదేవుడి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

‘దుండగులను కఠినంగా శిక్షించాలి’

కుంటాల: భైంసా శివారులోని నాగదేవత ఆలయంలో చోరీకి పాల్పడి విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు కేశెట్టి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లింబా(కె) హనుమాన్ ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. హిందూ ఆలయాల్లో చోరీ జరుగుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. భైంసా పట్టణంలోని బుధవారం నిర్వహించిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. సమావేశంలో సమితి సభ్యులు సాయి సూర్యవంశీ, ఆష్టం నరేశ్, దత్తుపటేల్, మనోహర్ పండరీ, ప్రమోద్, నారాయణ, రాములు, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ శివారులో ఇటుకబట్టీల్లో పని చేస్తున్న 20 మంది వలస కార్మికులకు బుధవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమితి జిల్లా అధ్యక్షుడు భీమ్‌చంద్, భైంసా ప్రతినిధులు సూరి శ్రీనివాసరాజు, సాయినాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడి కుటుంబానికి అండ

తానూరు : మండలంలోని భోసి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బామన్ రాఘవులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం భైంసా ఐక్యత సేవాసమితి సభ్యులు బాధిత కుటుంబానికి రూ. నాలుగు వేల విలువైన సరుకులు అందించారు. సభ్యులు కసరోల్ల నర్సయ్య, శ్రీనివాస్ ధోని తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


బహుమతి అందిస్తున్న మోతీలాల్

నర్సాపూర్(జి): క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతుందని జాదవ్ మోతీలాల్ పటేల్ అన్నారు. మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో తన తండ్రి జాదవ్ హిమ్మత్‌రావు పటేల్ స్మారకార్థం గ్రామస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. విజేత జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.ఏడు వేల నగదు, ద్వితీయ బహుమతిగా రూ.4వేల నగదుతోపాటు ట్రోఫీలను బుధవారం అందజేశారు. అనంతరం మోతీలాల్ పటేల్‌ను నిర్వాహకులు సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్ కలీం, డాక్టర్ భోజన్న, వెంకట్ నరసింహారెడ్డి, సయ్యద్ షఫీ, సయ్యద్ ఫిర్దోస్, తాహిర్, ఆమెర్ తదితరులు పాల్గొన్నారు.

మక్క సాగుకే మొగ్గు

- వానాకాలం కన్నా పెరిగిన విస్తీర్ణం
- స్వల్ప పెట్టుబడితో ఆదాయం వస్తుండటంతో ఆసక్తి


మొహాళలో యాంసగిలో సాగు చేసిన మొక్కజొన్న

లోకేశ్వరం: జిల్లాలో రైతులు ఎక్కువ మంది యాసంగిలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఇతర పంటలు సాగు చేస్తే పెట్టుబడులు పెరగడం.. ఆశించిన దిగుబడులు రాకపోవడం వంటి పరిస్థితులు మక్క సాగుకు కారణమవుతున్నాయి. దీంతో వ్యాపారులు కూడా ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ ఇచ్చి రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో గతేడాది యాసంగిలో 95 వేల ఎకరాల్లో.. వానాకాలంలో 15 వేల ఎకరాల్లో పంటను సాగు చేయగా.. ఈసారి యాసంగిలో లక్షకు పైగా ఎకరాల్లో పంటను సాగు చేస్తారని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

సాగు వ్యయం తక్కువ..
మొక్కజొన్న పంట సాగుకు పెట్టుబడి తక్కువ. విత్తనం నాటినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు యంత్రాలతోనే పనులు చేయిస్తుండటంతో కూలీల అవసరం నామమాత్రమే. పంటకు నీటి తడులు తగ్గినా ఇబ్బంది ఉండదు.

మద్దతు ధర కంటే ఎక్కువ వస్తుండటంతో..
వర్షాలతో భూగర్భజలాలు పెరగడంతో ఈ యాసంగిలో మక్క సాగు చేసేందుకు ఎక్కువ మంది ముందుకొచ్చారు. మరోవైపు కొన్నేళ్లుగా మక్కలకు డిమాండ్ ఉంటుంది.
మరోవైపు ప్రభుత్వం కూడా క్వింటాల్ మక్కలకు రూ.2,225 మద్దతు ధర అందిస్తోంది. ఒక్కోసారి ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే అధికంగా చెల్లించి పంటను కొంటున్నారు. ముఖ్యంగా కోళ్లకు, పశువులకు దాణాగా మక్కలను ఉపయోగిస్తుండటంతో వీటికి డిమాండ్ పెరుగుతుంది.

త్వరగా చేతికి వస్తూ ..
మొక్కజొన్న పంట ఫిబ్రవరిలోనే చేతికి వస్తుంది. వరి సాగు చేస్తే ఏప్రిల్, మే నెలలో పంట చేతికి వస్తుంది. దీనికి తోడు ఆకాలవర్షాలు వడగండ్లతో పంట దెబ్బతింటుంది. అదే మొక్కజొన్న సాగుకు సమస్య ఉండదు. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. ఖర్చులు పోనూ ఎకరాకు రూ.40వేలకు పైనే మిగులుతుందని రైతులు పేర్కొంటున్నారు.

నష్టం ఉండదు



వర్షాకాలంలో పంటలతో నష్టపోయా. మొక్కజొన్న లాభసాటిగా ఉంటుంది. ప్రస్తుతం బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంది. గత యాసంగిలో ఏడెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఎకరాకు 37 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. ఈసారి 14 ఎకరాల్లో మక్క పండిస్తున్నా.
– గన్ను నర్సారెడ్డి, పుస్పూరు

12 ఎకరాల్లో సాగు చేస్తున్నా



వానాకాలంలో సోయాబీన్, పత్తి పంటలు వేస్తే అధిక వర్షాలకు దెబ్బతిన్నాయి. ఆ నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు మక్క సాగు చేస్తున్నా. గతేడాది రెండెకరాల్లో పంట సాగు చేయగా.. ఎకరాకు రూ.35 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. ఈసారి 12 ఎకరాల్లో పంట పండిస్తున్నా.
– సంజీవ్‌రెడ్డి, ధర్మోర

జగమంతా సాయిమయం..


పట్టణంలో స్వాగత తోరణం


శాస్త్రీనగర్ హనుమాన్ ఆలయం

- నిర్మల్‌లో పదేళ్లుగా సాయి పారాయణం
- నేటి నుంచి ప్రారంభం.. ఏర్పాట్లు చేసిన సాయిదీక్ష సేవా సమితి
- షిర్డీ నుంచి పల్లకి, పాదుకల రాక

నిర్మల్: ఆధ్యాత్మికతకు నెలవైన జిల్లాకేంద్రంలో పదేళ్లుగా నిరాటంకంగా ప్రతి ఏటా సాయి పారాయణం సాగుతోంది. 11వ ఏటా నిర్వహించే ఈనెల2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు. గురువారం నుంచి ఆరు రోజులపాటు సాగే పారాయణం కార్యక్రమానికి సాయిదీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అభయాంజనేయస్వామి మందిరంలో..
ఈసారి మహాసాయి పారాయణం పట్టణంలోని శాస్త్రీనగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం లోక కల్యాణార్థం సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. పదేళ్లుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి ఆదరణ లభిస్తోంది. సాయి పారాయణం పఠిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ కార్యక్రమానికి షిర్డీ నుంచి వికాస్ మహారాజ్ ఆధ్వర్యంలో సాయిపల్లకి, బాబా పాదుకలను తెప్పిస్తుండటం విశేషం.

ఆధ్యాత్మికత పెంచేందుకు..



ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంచి సాయిబాబా ఆశీస్సులు అందరూ అందుకోవాలనే ఉద్దేశంతోనే ఇరవై ఏళ్లుగా సాయి దీక్ష సేవా సమితి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన బాబా ఆలయాన్ని అద్భుత క్షేత్రంగా తీర్చిదిద్దాం. 11వసారి పారాయణం విజయవంతం చేయాలి.
– లక్కడి జగన్మోహన్‌రెడ్డి, సాయిదీక్ష సేవా సమితి అధ్యక్షుడు

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన పెద్ద భీమన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ పరామర్శించారు. మృతుడి అల్లుడు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్‌తో మాట్లాడి మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికే చెందిన పురంశెట్టి శేఖర్‌కు మాతృవియోగం కావడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజగంగన్న, గజేందర్, వాల్‌సింగ్, మధు, రాజు, సత్యం, కలీల్, ప్రదీప్, సుమిత్, షోయబ్ తదితరులు ఉన్నారు.

హమాలీ రేట్లు పెంచాలని సమ్మె


సారంగపూర్ : దీక్ష చేస్తున్న కార్మికులు


భైంసాలో..

సారంగపూర్: లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు, బోనస్ పెంచి ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ ఎదుట బుధవారం హమాలీ కార్మికులు ధర్నా చేపట్టారు. హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పుండలిక్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. హమాలీ, చాటావాల కార్మికులు ఉన్నారు.
ఖానాపూర్: పట్టణంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ ముందు సివిల్ సప్లయి హమాలీలు బుధవారం సమ్మెకు దిగారు. హమాలీ రేట్ల ఒప్పందానికి తీసుకొచ్చిన జీవో అమలుతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భీమేశ్, రమేశ్, నర్సయ్య, భూమారెడ్డి, చిన్నయ్య తదితరులు ఉన్నారు.
భైంసాటౌన్: సివిల్ సప్లయ్ గోదాముల్లో పని చేస్తున్న హమాలీలకు రేట్లు పెంచాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాం వద్ద హమాలీలు సమ్మెకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ పిలుపు మేరకు నిరవధిక సమ్మెకు దిగినట్లు తెలిపారు. ప్రభుత్వం.. కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం ఒప్పందం అమలు చేసి హమాలీ రేట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముత్తన్న, హమాలీలు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి’


భైంసాటౌన్ : కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

భైంసాటౌన్: క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసి.. వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు ఆ పార్టీ ముధోల్ నియోజకవర్గ సమన్వయకర్త విలాస్ గాదేవార్ తెలిపారు. నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై చర్చించినట్లు వివరించారు. ఆయన వెంట సమన్వయకర్తలు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్ ఉన్నారు.
నిర్మల్‌టౌన్: నిర్మల్ మండలం రత్నాపూర్‌కాండ్లీ మాజీ ఎంపీటీసీ మహేశ్ బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ ఉన్నారు.

విశ్రాంత సైనికుడికి ఘన స్వాగతం


రాజాగౌడ్‌ను సన్మానిస్తున్న మిత్రబృందం

లక్ష్మణచాంద: ఆర్మీలో 28 ఏళ్లు సేవలందించి సుబేదార్‌గా ఉద్యోగ విరమణ పొందిన జవాన్‌కు బుధవారం పార్‌పెల్లి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. లక్ష్మణచాంద మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన వంగ రాజాగౌడ్ 1996లో ఆర్మీలో చేరారు. వివిధ విభాగాల్లో సేవలందించి గత నెల డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ పొందారు. బుధవారం స్వగ్రామానికి వచ్చిన రాజాగౌడ్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఇతడిని స్ఫూర్తిగా తీసుకొని పలువురు యువకులు ఆర్మీ, నేవీ ఉద్యోగాలు చేస్తున్నారు. పొట్టపెల్లి(బీ) గ్రామం నుంచి పార్‌పెల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో పలువురు గ్రామపెద్దలు రాజాగౌడ్‌ను సత్కరించారు. తాజా మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీటీసీలు కల్యాణి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94లో తనతో కలిసి పదో తరగతి చదివిన మిత్రులు.. రాజాగౌడ్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో సాయన్న, జె.శ్రీనివాస్, హుస్సేన్, లింగన్న, గంగన్న, జగన్‌మోహన్, కె.శ్రీనివాస్, నాగరాజు, అశోక్, సంతోష్‌రెడ్డి, సురేశ్, రతన్, నాగభూషణ్, భూమన్న, జలీల్, బాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివస్


ముధోల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

ముధోల్: మండలకేంద్రంలో బుధవారం భీమా కోరేగావ్ విజయ్ దివస్ నిర్వహించారు. భీమ్‌సైనిక్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం భీమా కోరేగావ్‌లో 1818 జనవరి 1న జరిగిన వన యుద్ధంలో అమరులైన మహార్ సైనికుల ధైర్యసాహసాలను గుర్తు చేసుకుంటూ స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సోన్ కాంబ్లే గంగాధర్, భీమ్ సైనిక్‌యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో బుధవారం భీమా కోరెగావ్ శౌర్య దివస్ జరుపుకొన్నారు. బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధమహాసభ నాయకులు సంజు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు


శాకాంబరి అమ్మవారికి మొక్కుతున్న మహిళ


నిర్మల్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ..


కుంటాల: కల్లూరు సాయిబాబా ఆలయంలో..


నిర్మల్‌లోని హరిహరక్షేత్రం అయ్యప్ప ఆలయంలో దర్శనం కోసం భక్తులు

నిర్మల్‌ఖిల్లా/సాక్షి ఫోటోగ్రాఫర్, నిర్మల్/భైంసాటౌన్/కుంటాల: నూతన సంవత్సరం తొలిరోజున బుధవారం జిల్లాకేంద్రంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. తమను, తమ కుటుంబసభ్యులను ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉంచాలని స్వామివారిని వేడుకున్నారు. నిర్మల్‌లోని దివ్యనగర్ హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయం, నందిగుండం దుర్గామాత ఆలయం, గండిరామన్న సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు చోట్ల భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. వేదపండితులు భక్తులకు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కుంటాల మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయం, కుంటాలలోని శ్రీ గజ్జలమ్మ దేవి, ఉమామహేశ్వర, మహాదేవుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.
భైంసాలోని కిసాన్‌గల్లి అన్నపూర్ణ క్షేత్రం అయ్యప్ప ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి మంత్రి సాయినాథ్ ఆధ్వర్యంలో స్వామివారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పద్మావతి కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, బాగుబాయి గుట్టపైఉన్న సాయిబాబా ఆలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.
లక్ష్మణచాంద: మండలంలోని లక్ష్మణచాంద వేణుగోపాలస్వామి ఆలయం, చింతల్‌చాందలోని వినాయకస్వామి, కనకాపూర్ దుర్గాదేవి, బాబాపూర్ రాజరాజేశ్వరస్వామి, చామన్‌పెల్లి రామాలయంతోపాటు వడ్యాల్, పీచర, మునిపెల్లి, పొట్టపెల్లి తదితర గ్రామాల్లోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కనకాపూర్ దుర్గామాత ఆలయం వద్ద..

ఐడియా అదిరింది


ట్రాలీపై కేజీవీల్స్ తీసుకెళ్తున్న రైతు

లక్ష్మణచాంద: వరినాట్ల సమయంలో తొడుగుల్లేకుండా కేజీవీల్స్ ట్రాక్టర్లు వెళ్తే రోడ్లు దెబ్బతింటున్న విషయం తెలిసిందే. దీనికి తోడు సదరు ట్రాక్టర్ యజమానులకు పోలీసులు జరిమానా విధించేవారు. లక్ష్మణచాందకు చెందిన ట్రాక్టర్ల యజమానులు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను పొలాల వద్దకు తీసుకెళ్లేందుకు ట్రాలీలను తయారు చేయించారు. దీంతో రోడ్లు దెబ్బతినకుండా ఉంటున్నాయి. మండలంలోని పొట్టపెల్లి(కే) వద్ద కేజీవీల్స్ ట్రాక్టర్‌ను ఓ రైతు పొలం వద్దకు ట్రాలీపై తీసుకెళ్తూ ‘సాక్షి’ కెమెరాకు చిక్కింది.

సంక్షిప్త వార్తలు

కుభీర్ ఈవో బదిలీ
కుభీర్: కుభీర్ పంచాయతీ ఈవో(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)కె.రాజేశ్వర్ బదిలీపై లోకేశ్వరం వెళ్లారు. ఆయన స్థానంలో బెల్గాం పంచాయతీ కార్యదర్శి కమల్‌సింగ్‌కు కుభీర్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

నేడు ఆలయ కమిటీ సమావేశం
ఖానాపూర్: పట్టణంలోని శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28వ వార్షికోత్సవంలో భాగంగా జరిగే సమావేశానికి పట్టణవాసులు హాజరు కావాలని కోరారు.

నేడు బూత్ అధ్యక్షుల సమావేశం
లోకేశ్వరం: మండలకేంద్రంలోని వెంకటేశ్వర్ కల్యాణ మండపంలో గురువారం ఉదయం 10గంటలకు పోలింగ్ బూత్ కమిటీల అధ్యక్షులకు సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల కన్వీనర్ జయసాగర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ కార్యకర్తలు హాజరవాలని కోరారు.

కనుల పండువగా పడిపూజ
సోన్: మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లో సాయిబాబా ఆలయం వద్ద గురుస్వాములు అనురాగ్‌శర్మ, పెంట దత్తాద్రి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా నూతన సంవత్సరం మొదటి రోజున సామూహిక మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం అయ్యప్ప ప్రతిమను వివిధ పుష్పాలతో అలంకరించి పంచామృతాలతో అభిషేకం చేశారు. 18వసారి మాలధారణ పూర్తి చేసిన నారీకేలి బీజీరెడ్డి స్వామిని, తోటి అయ్యప్ప స్వాములు జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మహా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష విరమణ


శంకర్‌కు నిమ్మరసం అందిస్తున్న నాయకులు

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి చైర్మన్‌ను నియమించాలనే డిమాండ్‌తో మండలకేంద్రంలోని మార్కెట్ కార్యాలయం ఎదుట మండలంలోని పార్డి(బి)కి చెందిన కొత్త శంకర్ సోమవారం నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కాంగ్రెస్ నాయకుడు చంకర్‌చంద్రే, బీజేపీ నాయకుడు బి.విఠల్, బాలేరావ్ గంగాధర్, సంతోష్, కాంగ్రెస్ నాయకులు రమేశ్, సాహెబ్‌రావ్, నరేందర్, బషీర్, బంక బాబు తదితరులున్నారు.